
సాక్షి
ఖమ్మం
ఆదివారం । 23 । మార్చి । 2025



భయపెడుతున్న లిఫ్ట్‌లు

అపార్ట్‌మెంట్లు, బహుళ అంతస్తుల భవనాల్లో లిఫ్ట్‌ల కారణంగా జరుగుతున్న ప్రమాదాలు ప్రజలను ఆందోనకు గురిచేస్తున్నాయి. 8లో



గరిష్టం / కనిష్టం
39° / 23°

వాతావరణం

జిల్లాలో ఆదివారం సాధారణ ఉష్ణోగ్రతలే నమోదవుతాయి. చాలా ప్రాంతాల్లో ఎండ ప్రభావం తక్కువగానే ఉంటుంది.

న్యూస్‌రీల్

నేడు ఉమ్మడి జిల్లాలో మంత్రి పొంగులేటి పర్యటన

ఖమ్మంవన్‌టౌన్/ఖమ్మం రూరల్: రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదివారం ఉమ్మడి జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని పలు ప్రాంతాల్లో బీటీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. ఆ తర్వాత తిరుపతమ్మతల్లి ఆలయంలో పూజలు చేయనున్న మంత్రి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చుంచుపల్లి మండలం విద్యానగర్ కాలనీ మీదుగా భద్రాచలం చేరుకుంటారు. అక్కడ ఏఎంసీ కాలనీలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేస్తారు. సాయంత్రం ఆతర్వాత భద్రాచలంలోని మనుబోతుల చెరువు వద్ద తడి, పొడి చెత్త కలెక్షన్ సెంటర్‌ను ప్రారంభించాక, కొత్తగూడెంలోని ఆఫీసర్స్ క్లబ్‌లో జరిగే ఇఫ్తార్ విందులో పాల్గొంటారు.

ఆరు చెక్‌డ్యాంలకు రూ.32.44 కోట్లు

కూసుమంచి: పాలేరు నియోజకవర్గంలో ఆరు చెక్ డ్యాంల నిర్మాణానికి రూ.32,44,60,000 నిధులు మంజూరయ్యాయి. ఈమేరకు ఇరిగేషన్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రాహుల్ బొజ్జా జేరిట ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ నిధులతో ఖమ్మం రూరల్ మండలం జాన్‌బాద్ తండా, చౌటవాగు తండా, కూసుమంచి మండలంలోని జక్కేపల్లి, నేలకొండపల్లి మండలంలోని చెన్నారం, పైనంపల్లి, సదాశివపాలెం వద్ద ఏటిపై చెక్‌డ్యాంలు నిర్మించనున్నారు.

రెండో రోజుకు చేరిన పరీక్షలు

ఖమ్మం సహకారనగర్: పదో తరగతి వార్షిక పరీక్షలు శనివారం రెండో రోజుకు చేరాయి. ఈ సందర్భంగా హిందీ పరీక్షకు జిల్లాలో 16,386 మంది విద్యార్థులకు గాను 16,352మంది హాజరయ్యారని డీఈఓ సోమశేఖరశర్మ తెలిపారు. జిల్లా అబ్జర్వర్ నాలుగు, పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ రెండు, ఫ్లయింగ్ స్క్వాడ్ 37 కేంద్రాలతో పాటు తాను ఎనిమిది కేంద్రాల్లో తనిఖీ చేసినట్లు వెల్లడించారు.

అభిషేకం, పల్లకీసేవ



పల్లకీ సేవలో పాల్గొన్న అర్చకులు, భక్తులు

ఎర్రుపాలెం: తెలంగాణ తిరుపతిగా పేరున్న జమలాపురంలోని శ్రీవేంకటేశ్వరస్వామివారి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. స్వామి మూల విరాట్‌తో పాటు స్వామివారి పాదానికి అర్చకులు పంచామృతంతో అభిషేకాలు చేశారు. అలాగే, స్వామి, అమ్మవార్లను పట్టువస్త్రాలతో అలంకరించి నిత్య కల్యాణం జరిపించాక, పెద్దసంఖ్యలో హాజరైన భక్తుల సమక్షాన పల్లకీ సేవ నిర్వహించారు. కాగా, ఈనెల 30న ఉగాది పండుగ నుండి ఆలయంలో జరిగే వసంత నవరాత్రి బ్రహ్మోత్సవాల వాల్‌పోస్టర్లను ఆలయంలో ఆవిష్కరించారు. ఈఓ జగన్మోహన్‌రావు, వ్యవస్థాపక ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, సూపరింటెండెంట్ విజయకుమారి, ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాసశర్మ పాల్గొన్నారు.


స్వచ్ఛ సర్వేక్షణ్ ఫీడ్‌బ్యాక్‌లో రెండో స్థానం

ఖమ్మంమయూరిసెంటర్: స్వచ్ఛ సర్వేక్షణ్–2025లో ఫీడ్‌బ్యాక్ నమోదు చేసేందుకు ఖమ్మం నగర ప్రజలు ఆసక్తి కనబరుస్తున్నారు. ఇప్పటివరకు 19,908 మంది వివిధ రూపాల్లో ఫీడ్‌బ్యాక్ నమోదు చేశారు. దీంతో కేఎంసీ రాష్ట్రంలోనే రెండో స్థానంలో నిలిచిందని అధికారులు వెల్లడించారు. చెత్త సేకరణ, తడి పొడి చెత్త నిర్వహణ, రోడ్లపై వ్యర్థాల సేకరణ, పారిశుద్ధ్య సిబ్బంది స్పందన తదితర అంశాలపై ప్రశ్నలకు ప్రజలు సమాధానాలు ఇస్తున్నారు. కాగా, ఢిల్లీకి చెందిన స్వచ్ఛ సర్వేక్షణ్ ప్రత్యేక బృందం ఖమ్మంలోని పలు డివిజన్లలో నాలుగు రోజుల పాటు పర్యటించింది.

'రెవెన్యూ'లోకి వచ్చేందుకు అంగీకారం

ఖమ్మం సహకారనగర్: పూర్వ వీఆర్‌ఓలు, వీఆర్‌ఏలను గ్రామ పాలన అధికారులు(జీపీఓ)గా నియమించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా రాష్ట్రంలో 10,954 జీపీఓ పోస్టులు మంజూరు చేసింది. ఈమేరకు ఉద్యోగుల నుంచి ఆప్షన్ కోరగా జిల్లాలోని 612మంది వీఆర్‌ఏల్లో 486మంది, 312మంది వీఆర్వోల్లో 207మంది తిరిగి రెవెన్యూ శాఖలోకి వచ్చేందుకు అంగీకారం తెలిపారు. కాగా, ప్రభుత్వం నిర్ణయంపై గ్రామ రెవెన్యూ అధికారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గరికె ఉపేంద్రరావు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

మరిచిపోలేని మహమ్మారి





మునుపెన్నడూ చూడని.. వినని విపత్తు జనాన్ని అతలాకుతలం చేసింది. ఎవరిని తాకితే ఏమవుతుందో.. ఏం తింటే ఏమైపోతామో అన్న భయం అందరినీ వెంటాడింది. చికిత్స ఎలా, మందులు ఏమిటి అన్న విషయం తెలియక వైద్యులు సతమతమైన తరుణాన ప్రజలైతే బెంబెలేత్తిపోయారు. ఆ వైరస్ పేరు కరోనా. ఆ భయానక అనుభవం ఎదురై ఐదేళ్లు కావొస్తుండగా.. ఇప్పటికీ ఆ రోజులు గుర్తుకొస్తే వైరస్ బారిన పడిన కుటుంబాలు విలవిల్లాడిపోతున్నాయి. జిల్లాలో తొలి కరోనా కేసు 2020 ఏప్రిల్ 6న నమోదైంది. అంతకుముందు మార్చి 24వ తేదీ నుంచే ప్రభుత్వం లాక్‌డౌన్ విధించగా జనజీవనం స్తంభించింది. రాకపోకల నిలిపివేతతో ఎక్కడి వారు అక్కడే ఉండిపోగా.. ఉపాధి కరువై, ఇళ్లలో సామగ్రి లేక పలువురు అర్ధాకలితో అలమటించారు. సుమారు 40 రోజులు రవాణా వ్యవస్థ స్తంభించిన ఆ సమయంలో… ప్రభుత్వ యంత్రాంగం, స్వచ్ఛంద సంస్థలు నిత్యావసరాలు పంపిణీ చేసినా అవి ఏ మాత్రం సరిపోక ప్రజలు ఇక్కట్లు ఎదుర్కొన్నారు. – ఖమ్మంవైద్యవిభాగం

ఐదేళ్ల క్రితం గడగడలాడించిన కోవిడ్

- వేలాది మంది ప్రాణాలు బలితీసుకున్న వైరస్
- జిల్లాలో వీధిన పడిన వేల కుటుంబాలు
- వైరస్ కట్టడికి అహర్నిశలు శ్రమించిన యంత్రాంగం

వేవ్	పరీక్షలు	కరోనా కేసులు
మొదటి	3,02,156	23,789
రెండు	14,06,253	68,030
మూడు	4,01,743	18,359
ఆతర్వాత	25,200	216

పిట్టల్లా రాలిన జనం

ఒపక్క పనిలేక తిండికి ఇబ్బంది పడుతున్న ప్రజలను కోవిడ్ వ్యాప్తి కంటిమీద కునుకు లేకుండా చేసింది. ఎవరి ద్వారా ఎవరికి వ్యాపిస్తుందో తెలియక ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని జీవించారు. కోవిడ్ మొదటి వేవ్‌లో ప్రభుత్వం మాత్రమే ఆర్‌టీపీసీఆర్, ర్యాపిడ్ టెస్టులు నిర్వహించేది. దీంతో ఏ చిన్న లక్షణం కనిపించినా పరీక్ష చేయించుకోవడం.. ఆపై ప్రభుత్వం ఇచ్చే కిట్‌లో మందులు వాడేవారు. కొందరైతే సొంతంగా ఐసోలేషన్‌లో ఉంటూ కుటుంబాలకు దూరంగా గడిపారు.

ఏడాది పాటు తొలి వేవ్

కరోనా మొదటి వేవ్ 2020 ఏప్రిల్ నుండి 2021 మార్చి వరకు కొనసాగింది. యంత్రాంగం ఎంత కష్టపడినా వైరస్ వ్యాప్తికి అడ్డుకట్ట పడలేదు. లాక్‌డౌన్ సడలింపు వేళలో ప్రజలు నిత్యవసరాల కోసం రావడం, ఇతర ప్రాంతాలకు వెళ్తుండడం.. ఆ సమయాన జాగ్రత్తలు పాటించకపోవడంతో కేసులు గణనీయంగా పెరిగాయి. మొదటి వేవ్‌లో జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ర్యాపిడ్, ఆర్‌టీపీసీఆర్ టెస్టులు 3,02,156మందికి నిర్వహించగా 23,789 మందికి కరోనా నిర్ధారణ అయింది. అయితే ఇంటి వద్ద చికిత్స చేయించుకున్న వారు, ప్రైవేట్ ఆస్పత్రుల్లో పరీక్షలు చేయించుకున్న వారితో కలిపితే ఈ లెక్కలు మరింత పెరుగుతాయి. కాగా, మొదటి వేవ్‌లో కరోనా వ్యాక్సిన్ రావడంతో జనం ఊపిరి పీల్చుకున్నారు. తొలుత ఫ్రంట్‌లైన్ వారియర్స్‌కు వ్యాక్సిన్ అందించిన ప్రభుత్వం.. ఆతర్వాత అందరికీ ఇవ్వడానికి రెండేళ్లు పట్టింది.

రెండో వేవ్‌లో అల్లాడిన జనం

కోవిడ్ రెండో వేవ్ 2021 ఏప్రిల్‌లో ప్రారంభం కాగా డిసెంబర్ వరకు కొనసాగింది. ఈ వేవ్‌లో రాష్ట్రవ్యాప్తంగా పరిశీలిస్తే ఖమ్మం జిల్లానే ఎక్కువ తల్లడిల్లింది. కోవిడ్ సోకిన రెండు, మూడు రోజులకే కొందరు మృతి చెందడమే కాక వృద్ధుల మరణాలు గణనీయంగా నమోదయ్యాయి. ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో పడకలు సరిపోక చికిత్స అందకపోవడంతో గంటల్లోనే ప్రాణాలు వదలడం సాధారణంగా మారింది. దీనికి తోడు చాలాచోట్ల ఆక్సిజన్ కొరత ఏర్పడింది. ఇదే సమయాన కరోనా వ్యాప్తి ఎక్కువగా ఉండడంతో మృతుల అంత్యక్రియలు నిర్వహించడానికి కుటుంబీకులు సైతం ముందుకు రాని పరిస్థితులు నెలకొన్నాయి. ఈ రెండో వేవ్‌లో కరోనాకు రెమిడిసివర్ ఇంజక్షన్ అందుబాటులోకి వచ్చింది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచితంగానే సరఫరా చేసినా ప్రైవేట్ ఆస్పత్రుల్లో రూ.50 వేల నుండి రూ.70 వేల వరకు వసూలుచేశారు.

అధికారికంగా మరణాలు.. 1,185

కరోనా రెండో వేవ్‌లో ప్రభుత్వ పరంగా 14,06,253 మందికి ర్యాపిడ్, ఆర్‌టీపీసీఆర్ టెస్టులు నిర్వహించగా 68,030మంది కోవిడ్ బారిన పడినట్లు తేలింది. ఇందులో 1,185మంది మాత్రమే మృతి చెందినట్లు అధికారికంగా లెక్కలు చూపారు. కానీ ఈ మరణాల సంఖ్య రెండింతలు ఉంటుందని చెబుతారు. ఇక 2022 కరోనా మూడో వేవ్ వచ్చినా 4,01,743 మందికి పరీక్షలు చేసి 18,359 మందికి కరోనా సోకిందని నిర్ధారించారు. ఇందులో 52 మంది మృతి చెందారు. అలాగే, 2023లో 25,200 మందికి పరీక్షలు చేయగా 216 మందికి కోవిడ్ సోకగా ఎవరూ మృతి చెందలేదు. అప్పటికే అందరూ రెండు డోసుల వ్యాక్సిన్ వేసుకుని ఉండడం.. కరోనాకు అన్ని వ్యాధుల మాదిరి చికిత్స సాధారణంగా మారడంతో 2024 నుండి కోవిడ్ ప్రభావం పూర్తిగా క్షీణించింది.

ప్రసవాలు ఆపలేదు..



కోవిడ్ సమయాన ఎంసీహెచ్‌లో గైనిక్ హెచ్‌ఓడీగా ఉన్నా. వైద్యులు, సిబ్బంది కోవిడ్ బారిన పడినా ప్రసవాలు నిర్వహించాం. కోవిడ్ బారిన పడిన 500మంది గర్భిణులకు ప్రసవాలు చేశాం. ఖమ్మం కేంద్రంగా అందించిన గైనిక్ సేవలకు మన్ననలు అందాయి.
– కృపా ఉషశ్రీ, గైనిక్ హెచ్‌ఓడీ, తిరుమలాయపాలెం

సంతృప్తి మిగిలింది..



పెద్దాస్పత్రిలో కరోనా మొదటి, రెండో వేవ్ సమయాన పడకలు సరిపోకపోయేవి. బాధితుల తాకిడి దృష్ట్యా కిందే బెడ్లు వేసి వైద్యం చేశాం. ఎందరో ప్రాణాలు నిలిపామన్న సంతృప్తి మాకు మిగిలింది. వైద్యులు, సిబ్బంది అలాంటి అనుభవం మరెప్పుడూ రాదు.
– డాక్టర్ రాజశేఖర్ గౌడ్, జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి

వేలాది మృతదేహాలకు అంత్యక్రియలు



కుటుంబీకులు మరణించినా అంత్యక్రియలు నిర్వహించడానికి చాలా మంది ముందుకు రాలేదు. దీంతో ఖమ్మం, కొత్తగూడెం, సూర్యాపేట, మహబూబాబాద్ ప్రాంతాల్లో 3వేల మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహించాం. మానవధర్మం ప్రకారం పనిచేశాం.
– శ్రీనివాసరావు, అన్నం ఫౌండేషన్ చైర్మన్

వచ్చే వారం నుంచి 'గర్ల్ ప్రైడ్'

- ఆడపిల్ల పుట్టిన కుటుంబానికి శుభాకాంక్షలు చెప్పాలి
- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మం సహకారనగర్: జిల్లాలోని వచ్చేవారం నుంచి 'గర్ల్ ప్రైడ్' పేరిట ప్రత్యేక కార్యక్రమం చేపడుతున్నట్లు కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ వెల్లడించారు. కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్లు డాక్టర్ పి.శ్రీజ, పి.శ్రీనివాసరెడ్డితో కలిసి వివిధ అంశాలపై అధికారులతో సమీక్షించిన ఆయన మాట్లాడారు. జిల్లాలో ఎవరి ఇంట్లో ఆడపిల్ల పుట్టినా జిల్లా అధికారులు వెళ్లాల్సి ఉంటుందని తెలిపారు. ఈ మేరకు శిశువు తల్లిదండ్రులకు శుభాకాంక్షలు తెలిపి స్వీట్ బాక్స్, జిల్లా యంత్రాంగం తరఫున సందేశం ఇవ్వాలని సూచించారు. ఇందుకోసం జిల్లా సంక్షేమ అధికారి షెడ్యూల్ రూపొందించాలని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా అమ్మాయి పుట్టడమంటే అదృష్టమనే భావనను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సి ఉంటుందని చెప్పారు. కాగా, కలెక్టరేట్‌ను ప్లాస్టిక్ రహితంగా మార్చేలా ప్లాస్టిక్ కాకుండా స్టీల్ వస్తువులే వాడాలని సూచించారు. రెండు వారాల్లోగా ఇది పూర్తిస్థాయిలో అమలుకావాలన్నారు. కలెక్టరేట్‌తో పాటు తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల్లోనూ అమలుచేయాలని చెప్పారు. అనంతరం జిల్లాలో ఎనిమిది నెలల శిక్షణ పూర్తిచేసుకున్న అసిస్టెంట్ కలెక్టర్ మ్రిణాల్‌శ్రేష్ఠను సన్మానించారు.

దివ్యాంగులకు వసతుల కల్పన

ఖమ్మంవైద్యవిభాగం: సదరం క్యాంప్‌నకు వచ్చే దివ్యాంగులకు అవసరమైన వసతులు కల్పించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. జిల్లా ప్రధాన ఆస్పత్రిని పరిశీలించిన ఆయన ఏర్పాట్లపై అధికారులకు సూచనలు చేశారు. దివ్యాంగులకు యూడీఐడీ కార్డుల జారీపై అవగాహన కల్పించాలని, దివ్యాంగులు పరీక్షల నిమిత్తం ఆస్పత్రికి వచ్చినప్పుడు రిసెప్షన్ సెంటర్, కుర్చీలు, నీడ, తాగునీరు సమకూర్చి ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా చూడాలని తెలిపారు. ఈసమావేశాల్లో డీఎఫ్‌ఓ సిద్ధార్థ విక్రమ్‌సింగ్, డీఆర్వో ఏ.పద్మశ్రీ, ఎస్సీ డీడీ కస్తాల సత్యనారాయణ, డీఎంహెచ్‌ఓ కళావతిబాయి, జెడ్పీ సీఈఓ దీక్షారైనా, కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య, డీడబ్ల్యూఓ కె.రాంగోపాల్ రెడ్డి, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్, వివిధ విభాగాల అధికారులు ఉమామహేశ్వరరావు, డాక్టర్ కిరణ్ కుమార్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



స్కిల్ హబ్‌లో ఏర్పాట్లపై అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

యువత నైపుణ్యాల పెంపునకు స్కిల్ హబ్

ఖమ్మంమయూరిసెంటర్: జిల్లాలోని యువత నైపుణ్యతను పెంచేందుకు స్కిల్ హబ్ ఉపయోగపడుతుందని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. ఖమ్మం రేవతి సెంటర్ సమీపాన కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన స్కిల్ హబ్‌ను ఆయన పరిశీలించి మాట్లాడారు. ఇక్కడ శిక్షణ ఇవ్వడం, విద్యార్థులు, యువత మార్గనిర్దేశం చేసేలా కమిటీని ఎంపిక చేసుకోవాలని సూచించారు. ఎస్సెస్సీ, ఇంటర్ తర్వాత పిల్లలకు ఆంగ్లంపై శిక్షణ, కోడింగ్‌లో బేసిక్స్ నేర్పేందుకు యాప్‌లను రూపొందించామన్నారు. నాలుగో తరగతి ఉద్యోగయులు, పారిశుద్ధ్య కార్మికుల పిల్లలకు ఉచితంగా శిక్షణ అందుతుందని తెలిపారు.

ప్రభుత్వం నేతృత్వాన 'ఇఫ్తార్'

ఐదు నియోజకవర్గాలకు రూ.17లక్షల నిధులు

సత్తుపల్లి: కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తొలిసారి ఇఫ్తార్ విందులకు నిధులు కేటాయించింది. గత ఏడాది లోక్‌సభ ఎన్నికల కోడ్ ఉండడంతో విందులు ఏర్పాటు చేయలేదు. ఈసారి ముస్లిం జనాభా ఆధారంగా ప్రతీ నియోజకవర్గంలో మూడు చోట్ల ఇఫ్తార్ విందులు ఇచ్చేందుకు నిర్ణయించారు. ఈమేరకు ఖమ్మం నియోజకవర్గానికి రూ.5లక్షలు, మిగతా నాలుగు నియోజకవర్గాలకు రూ.3లక్షల చొప్పున నిధులు మంజూరయ్యాయి. తెలంగాణ ఏర్పడినప్పటి నుంచి ఏటా రంజాన్ మాసంలో ఇఫ్తార్ విందు ఇస్తుండగా.. కరోనా ఆంక్షల సమయాన మాత్రం మినయించారు. అయితే, ఈ ఏడాది విందుల నిర్వహణకు నిధులు విడుదల చేసినా.. తోఫా విషయమై స్పష్టత రాలేదు. పేద ముస్లింలకు ఒక చీర, పంజాబీ డ్రెస్, లాల్చీ పైజామా వస్త్రం అందించేవారు. గతేడాది కూడా ఇవ్వకపోగా, ఈసారి సైతం ఎలాంటి ప్రకటన విడుదల కాకపోవడంతో పేద ముస్లింలు తరచుగా మసీదుల వద్దకు వచ్చివెళ్తున్నారు.

జడిపించిన జల్లులు

- జిల్లాలోని పలు ప్రాంతాల్లో వర్షం
- ఆందోళనకు గురైన రైతులు



ఏన్కూరులో మిర్చి రాశులపై పట్టాలు కప్పుతున్న రైతులు

ఖమ్మంవ్యవసాయం/తిరుమలాయపాలెం/ఏన్కూరు: వాతావరణంలో చోటు చేసుకున్న మార్పులతో శనివారం ఉదయం జిల్లాలోని పలుచోట్ల వర్షపు జల్లులు కురిశాయి. దీంతో రైతులు కల్లాల్లో ఉన్న మిర్చి, మొక్కజొన్న పంటలను కాపాడుకునేందుకు పరుగులు తీశారు. మూడు రోజులుగా వాతావరణంలో మార్పులు వస్తుండగా పలుచోట్ల తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశముందని హైదరాబాద్‌లోని వాతావరణ కేంద్రం ప్రకటించింది. ఈమేరకు శనివారం ఉదయం ఉరుములు, మెరుపులతో ఈదురుగాలులు వీస్తూ ఖమ్మం, జిల్లాలోని పలు ప్రాంతాల్లో జల్లులు కురిశాయి. దీంతో కల్లాల్లో మిర్చి, మొక్కజొన్న ఆరబెట్టిన రైతుల్లో ఆందోళన నెలకొంది. వర్షం మొదలుకాగానే రైతులు కల్లాలకు పరుగులు తీసి కల్లాలపై టార్పాలిన్లు కప్పారు. అలాగే, మామిడి పూత, కాత దశలో ఉండడంతో రైతులు ఆందోళనకు గురైనా వర్ష ప్రభావం పెద్దగా లేకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. అయితే, మరో రోజులు వర్షాలు కురిసే అవకాశముందనే సూచనలతో రైతుల్లో కలవరం వీడడం లేదు.

'స్మార్ట్' రామయ్య!



భద్రాచలం: భద్రాచలం టెంపుల్ ఇన్ఫర్మేషన్ (బీటీఐ) యాప్ సిద్ధమైంది. సుదూర ప్రాంతాల భక్తులకు, యువతకు అరచేతిలో సమస్త సమాచారం అందించేలా రామాలయ ఈఓ ఎల్.రమాదేవి ఆధ్వర్యంలో ఆత్రేయ ఇన్ఫొటెక్ సిస్టం కంపెనీ యాప్‌ను రూపొందించింది. ఆండ్రాయిడ్ స్మార్ట్ ఫోన్‌లకు ప్లే స్టోర్‌లో ఈ యాప్ లభ్యమవుతుండగా, బార్ కోడ్ స్కాన్ ద్వారా సైతం డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఇప్పటికే వినియోగంలోకి తెచ్చినా శ్రీరామనవమి నాటికి అధికారికంగా ప్రారంభిస్తారు.

22 రకాల సేవలు..

ఆండ్రాయిడ్ ఫోన్లలో ప్లే స్టోర్‌లో భద్రాచలం టెంపుల్ ఇన్ఫర్మేషన్ అని టైపు చేయగానే యాప్ డిస్‌ప్లే అవుతుంది. ఇన్‌స్టాల్ చేసుకుని ఓపెన్ చేస్తే శ్రీ సీతారామ చంద్రస్వామివారి దేవస్థానం పేరిట మూలమూర్తుల ఫొటోతో పేజీ దర్శనమిస్తుంది. ఆలయ చరిత్ర ఆంగ్లంలో కనిపిస్తుంది. కింద కనిపించే సేవ అండ్ టైమింగ్స్ ఆప్షన్ క్లిక్ చేస్తే ఆన్‌లైన్ బుకింగ్ జాబితా పేరుతో ఆలయంలో నిత్యం అందే సేవలు, వేళల వివరాలు దర్శనమిస్తాయి. దేవస్థానంలో లభించే 22 రకాల సేవల వివరాలు పొందవచ్చు. ఇదేపేజీలో ఆలయం అందిస్తున్న సర్వీసులను, భక్తులు చేరుకునేందుకు గూగుల్ మ్యాప్‌ను అనుసంధానం చేశారు. భద్రాచలంలో ఉన్న అన్నదానం, కల్యాణ కట్ట, లడ్డూ కౌంటర్, పురుషోత్తపట్నం, ఆలయం వద్ద ఉన్న గోశాలలు, రామదాసు ధ్యాన మందిరం, ఆర్టీసీ బస్టాండ్, ఘాట్, ఎమర్జెన్సీ, ప్రచార రథం, ఇన్ఫర్మేషన్ సెంటర్ (సీఆర్‌ఓ) శ్రీ సీతారామ కల్యాణ మండపం, పర్ణశాలలో పర్ణశాల, నార చీరల ప్రాంతాలు, నేలకొండపల్లి, కొత్తగూడెం రైల్వేస్టేషన్ వివరాలను పొందుపర్చారు. ఇదే పేజీలో ఎటపాకలో ఉన్న జటా యువు మండపం, భద్రాచలంలో ఉన్న ట్రైబల్ మ్యూజియం, అభయాంజనేయస్వామి ఆలయం, ఏపీలోని పాపికొండలు, శ్రీరామగిరి మ్యాప్‌లు అనుసంధానం చేశారు.

ఉపాలయాలు వివరాలు కూడా..

మరో పేజీలో శ్రీ సీతారాముల రామాయణ ఇతివృత్తాన్ని తెలుగులో ఉంచారు. ఆ తర్వాత ఉపాలయాల వివరాలను అందుబాటులో ఉంచారు. ఈ పేజీలో భద్రాచలంలో రామాలయానికి అనుబంధంగా ఉన్న ఆలయాలు, పర్యాటక ప్రాంతాల వివరాలను యాప్‌లో అందుబాటులో ఉంచారు.

- 'బీటీఐ' యాప్‌లో రామాలయ సమస్త సమాచారం
- భక్తులకు అందుబాటులోకి తెచ్చిన ఆలయ అధికారులు
- శ్రీసీతారామ చంద్రస్వామివారి పూజలు, సేవల వివరాలు లభ్యం
- ఉపాలయాల వివరాలు, మార్గాలు కూడా అనుసంధానం
- ఆలయ అధికారులను అభినందించిన కలెక్టర్ జితేష్ వి.పాటిల్

క్లుప్తంగా

'ఒకే దేశం - ఒకే ఎన్నిక'తో ఆదా


కోటేశ్వరరావును సత్కరిస్తున్న నాయకులు

కొణిజర్ల: దేశమంతా ఒకేసారి ఎన్నికలు నిర్వహించడం ద్వారా సమయంతో పాటు నిధులు ఆదా అవుతాయని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు తెలిపారు. కొణిజర్లలో శనివారం 'వన్ నేషన్ – వన్ ఎలక్షన్'పై ఏర్పాటుచేసిన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రధాని మోదీ నేతృత్వాన తీసుకున్న నిర్ణయానికి అందరూ మద్దతు పలకాలని కోరారు. ఈకార్యక్రమంలో నాయకులు బండారు నరేష్, నల్లగట్ల ప్రవీణ్, చిన్నికృష్ణ, ఎం.సుబ్బారావు, రవీందర్, కొణిజర్ల మండల అధ్యక్షుడు మురళి తదితరులు పాల్గొన్నారు.

బందోబస్తును పరిశీలించిన అడిషనల్ డీసీపీ

ఖమ్మంక్రైం: పదో తరగతి పరీక్ష కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తును అడిషనల్ డీసీపీ ప్రసాదరావు శనివారం పరిశీలించారు. ఖమ్మంలోని పలు పరీక్ష కేంద్రాలను శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా సెక్షన్ 163 అమలు, ఇతర అంశాలపై సిబ్బందికి సూచనలు చేశారు. పరీక్షకు ముందు, తర్వాత ట్రాఫిక్ అంతరాయం కలగకుండా పర్యవేక్షించాలని, ఎలాంటి సభలు, ర్యాలీలే కాక మైకులు, డీజేలతో ప్రదర్శనలకు అనుమతి ఇవ్వొద్దని తెలిపారు.

ఉపాధి పనులు, నర్సరీల తనిఖీ


నర్సరీలో పరిశీలిస్తున్న అధికారులు

ఏన్కూరు: ఏన్కూరు మండలంలోని పలు గ్రామాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనులు, నర్సరీలను ఉపాధి హామీ జిల్లా విజిలెన్స్ అధికారి సక్రియా శనివారం తనిఖీ చేశారు. జన్నారం, రేపల్లెవాడ, మేడేపల్లి, భగవాన్‌నాయక్ తండా గ్రామాల్లో పర్యటించిన ఆయన నర్సరీల్లో ఔషధ మొక్కలను పెంచాలని తెలిపారు. అలాగే, ఉపాధి కూలీల సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో ఉద్యోగులతో పలు అంశాలపై సమీక్షించారు. ఎంపీడీఓ సకినాల రమేష్, ఎంపీఓ జీవీఎస్.నారాయణ, ఏపీఓ సూరయ్య పాల్గొన్నారు.

మాడిఫైడ్ సైలెన్సర్ల తొలగింపు, జరిమానా


సైలెన్సర్లు తీయిస్తున్న పోలీసులు

ఖమ్మంక్రైం: బుల్లెట్ వాహనాలకు కంపెనీతో వచ్చిన సైలెన్సర్లు తీయిస్తున్న పలువురు అధిక శబ్దం వెలువరించేవి ఏర్పాటుచేయిస్తున్నారు. వీటి కారణంగా ఇతర వాహనదారులు ఇబ్బంది పడుతుండడంతో ట్రాఫిక్ పోలీసులు స్పందించారు. ఈమేరకు ట్రాఫిక్ సీఐ మోహన్‌బాబు నేతృత్వాన శనివారం ఖమ్మంలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈసందర్భంగా 20 వాహనాలకు వింత శబ్దం వచ్చే సైలెన్సర్లు తీయించడమే కాక ఒక్కో వాహనదారుడికి రూ.వెయ్యి చొప్పున జరిమానా విధించామని తెలిపారు.

27న బార్ అసోసియేషన్ ఎన్నికలు

నామినేషన్లు ముగిసే నాటికి మూడు స్థానాలు ఏకగ్రీవమైనట్లు ప్రకటన

ఖమ్మం లీగల్: ఖమ్మం బార్ అసోసియేషన్ ఎన్నికలు ఈనెల 27న జరగనున్నాయి. నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిసే వరకు సంయుక్త కార్యదర్శి స్థానానికి మేకల నవీన్‌కుమార్, కోశాధికారిగా పి.నర్సింహరావు, మహిళా ప్రతినిధిగాపి.ఇందిర మాత్రమే ఉండడంతో ఏకగ్రీవమైనట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. ఇక మిగతా పోస్టులకు ఉత్కంఠ భరితంగా పోటీ నెలకొంది. అధ్యక్ష స్థానానికి తొండపు వెంకటేశ్వరరావు, సుగ్గల వెంకటేశ్వర్ గుప్తా, విజయరాఘవ, ప్రధాన కార్యదర్శి పదవికి తెల్లాకుల రమేష్‌బాబు, గద్దెల దిలీప్‌కుమార్, ఉపాధ్యక్ష పదవికి విజయశాంత, ఎస్‌కే. జానీమియా, రవిప్రసాద్, క్రీడా కార్యదర్శి పదవికి రాందాస్‌నాయక్, కే.వీ.వీ.లక్ష్మి, గ్రంథాలయ కార్యదర్శి పదవికి డి.కళ్యాణి, ఎస్.రాంబాబు పోటీలో ఉన్నారు. ఈమేరకు బార్ అసోసియేషన్‌లో 815మంది న్యాయవాదులు సభ్యులుగా ఉండగా, ఈనెల 27న ఎన్నికలు నిర్వహించనున్నారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.20,871

భయపెడుతున్న లిఫ్ట్‌లు

- సాంకేతిక లోపాలతో మొరాయిస్తున్న వైనం
- జిల్లాలో ఇప్పటివరకు ప్రమాదాల్లో ఇద్దరి మృతి
- నాణ్యత లేని పరికరాలే కారణమంటున్న నిపుణులు


ఖమ్మంలోని ఓ ఆస్పత్రిలో మరమ్మతుకు వచ్చిన లిఫ్ట్(ఎలివేటర్)

ఖమ్మంమయూరిసెంటర్: ఆడంబరంగా అపార్ట్‌మెంట్లు, బహుళ అంతస్తుల భవనాలు నిర్మిస్తున్న పలువురు.. లిఫ్ట్ విషయానికి వచ్చేసరికి ఎంత ధర తగ్గుతుందా అని ఆలోచిస్తున్నారు. దీంతో నాణ్యత పక్కన పెట్టి అసెంబుల్డ్ లిఫ్ట్(ఎలివేటర్)లు ఏర్పాటు చేయడానికే యజమానులు, బిల్డర్లు మొగ్గు చూపుతున్నారు. ఫలితంగా అవి తరచూ మొరాయించడం.. జనం ప్రమాదాల బారిన పడడం సాధారణంగా మారింది. ఇటీవల జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఎలివేటర్లు మధ్యలో పనిచేయకుండా ఆగిపోయిన ఘటనలు ఎదురవుతున్నాయి. లిఫ్ట్ నిర్వహణ సక్రమంగా లేక రెండేళ్ల క్రితం ఖమ్మంలో ఓ మహిళ డోర్ తెరుచుకొని గుంతలో పడి మరణించింది. తాజాగా ఖమ్మంలోని ప్రైవేట్ ఆస్పత్రిలోనూ శుక్రవారం ఇలాంటి ప్రమాదమే జరగడంతో ఆస్పత్రులు, అపార్ట్‌మెంట్లకు వెళ్తున్న వారు లిఫ్ట్ ఎక్కాలంటేనే భయపడే పరిస్థితులు నెలకొన్నాయి.

నాణ్యత లేనివే అధికం

జిల్లాలో సుమారు 2వేలకు పైగా ఎలివేటర్లు వినియోగంలో ఉన్నట్లు అంచనా. ఇందులో ఖమ్మంలోనే అపార్ట్‌మెంట్లు, ఆస్పత్రులు, షాపింగ్‌మాల్స్, మార్ట్‌లు, ప్రభుత్వ కార్యాలయాల్లో 1,800 వరకు ఉంటాయని సమాచారం. వీటిలో 700 – 800 మాత్రమే బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్(బీఐఎస్) ప్రమాణాల మేరకు నాణ్యమైనవి ఉన్నట్లు అంచనా. మిగిలినవన్నీ నైపుణ్యం లేని తయారీదారులు ఏర్పాటు చేసినవే కావడం గమనార్హం. తయారీ సంస్థల్లో ఐదారు నెలలు పనిచేసిన కార్మికులు సొంతంగా ఎలివేటర్లు తయారు చేసి ఇస్తుండడంతో తక్కువ ధరకు వస్తున్నాయని బిల్డర్లు, యజమానులు అటు మొగ్గు చూపుతున్నారు.

నిర్వహణ నామమాత్రమే..

గుర్తింపు పొందిన కంపెనీలకు సంబంధించిన లిఫ్ట్‌లనైతే సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందిస్తారు. వీటిలో ప్రధానంగా ఓఎస్‌జీ(ఓవర్ స్పీడ్ గవర్నర్) కంట్రోలర్ ఉంటుంది. అలాగే, ఎప్పుడైనా సాంకేతిక లోపం తలెత్తితే 'సేఫ్టీ క్యామ్స్' యాక్టివేట్ అయి లిఫ్ట్ కిందకు, పైకి వెళ్లకుండా ఉన్న చోటే ఆపేస్తాయి. ఫలితంగా ఎలాంటి ప్రమాదం లేకుండా అందులో ఉన్న వారు సురక్షితంగా బయటపడతారు. కానీ అసెంబ్లెడ్ పరికరాలతో తయారు చేసే లిఫ్ట్‌లలో ఇలాంటి రక్షణ సౌకర్యం ఉండదు. దీంతో సాంకేతిక లోపం ఎదురైనప్పుడు లిఫ్ట్ పైనుంచి ఒక్కసారిగా కింద పడడంతో అందులో ఉన్న వారు గాయాలపాలు కావడమో, చనిపోవడమో జరుగుతుంది. అంతేకాక కంపెనీవైనా, అసెంబ్లెడ్ లిఫ్ట్‌లైనా ఎప్పటికప్పుడు సర్వీసు చేయిస్తూ ఉండాలి. నెలకోసారి నిపుణులతో కంట్రోలర్, రోప్స్, బ్రేక్స్, గేర్ బాక్స్, రైలింగ్స్, పెడిస్టల్, డోర్ లాక్స్, సేఫ్ బోల్ట్స్ ఇతర పరికరాలను తనిఖీ చేయించాలి. కానీ జిల్లాలో ఇలా నెలవారీ సర్వీస్ చేయిస్తున్న లిఫ్ట్‌లు 400కు మించి ఉండవని చెబుతున్నారు.

ప్రమాదాలకు కొన్ని కారణాలు..

- చిన్న అపార్ట్‌మెంట్లలో ఖర్చు తగ్గించుకోవడానికి నాణ్యత లేని వాటిని ఏర్పాటు చేస్తున్నారు.
- నేషనల్ బిల్డింగ్ కోడ్ నిబంధనలను చాలా మంది పాటించడం లేదు. ప్రతీ లిఫ్ట్ ఏర్పాటుకు బీఐఎస్ నిబంధనలు తప్పక పాటించాలని ఎన్‌బీసీ చెబుతుంది. ఇక లిఫ్ట్‌లో ఎంత మంది ప్రయాణించగలరు, ఎంత బరువు మోస్తుందనే ప్రమాణాల మేరకు విద్యుత్ సరఫరా, సామగ్రి వినియోగంలో నిబంధనలు పాటించడం లేదు.
- లిఫ్ట్‌లో చిక్కుకుంటే ఎమర్జెన్సీ ఫోన్ చేయడానికి చాలా అపార్ట్‌మెంట్లలో ఏర్పాట్లు లేవు.
- సాంకేతిక నిపుణులతో తరచూ ఎలివేటర్లలో చేయించాల్సిన భద్రత ఆడిట్లు చాలా చోట్ల జరగడం లేదు. ఇక లిఫ్ట్ సామగ్రిని తరచూ మార్చాల్సి ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదు.

పట్టు రైతుల విజ్ఞాన యాత్ర


పట్టు రేరింగ్ షెడ్‌ను పరిశీలిస్తున్న రైతులు

ఖమ్మంవ్యవసాయం: పట్టు పరిశ్రమ శాఖ ఆధ్వర్యాన నిర్వహించిన విజ్ఞాన యాత్రలో ఉమ్మడి జిల్లాకు చెందిన 50 మంది పట్టు రైతులు పాల్గొన్నారు. రైతుల బృందం శనివారం రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం కోరింటకుంటలోని మల్బరీ తోటలు, పట్టు పురుగుల పెంపకం, రేరింగ్ షెడ్లను పరిశీలించింది. ఉమ్మడి జిల్లా పట్టు పరిశ్రమ ఉపసంచాలకులు ముత్యాల పర్యవేక్షణలో రైతులు ఈ యాత్రలో పాల్గొనగా, శాస్త్రవేత్తలు వినోద్‌కుమార్, రాఘవేంద్ర వారికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ముత్యాలు మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో పట్టు పరిశ్రమ ఏర్పాటుకు సమృద్ధిగా వనరులు ఉన్నాయని, మల్బరీ సాగుకు ఇక్కడి నేలలు అనుకూలంగా ఉన్నందున రైతులు ముందుకు రావాలని సూచించారు. ఈయాత్రలో సహాయ పట్టు పరిశ్రమ అధికారి దేవరాజు పాల్గొన్నారు.

మూల్యాంకనం ప్రారంభం


ఉద్యోగులకు సూచనలు చేస్తున్న డీఐఈఓ

ఖమ్మం సహకారనగర్: ఇంటర్మీడియట్ జవాబుపత్రాల మూల్యాంకనం శనివారం ప్రారంభమైంది. ఇందుకోసం ఖమ్మం నయాబజార్ జూనియర్ కళాశాలలో క్యాంప్ ఏర్పాటుచేశారు. ఒక్కో అసిస్టెంట్ ఎగ్జామినర్ రోజుకు 30జవాబుపత్రాలు మూల్యాంకనం చేయాల్సి ఉంటుంది. ఈ కేంద్రంలో 52మంది చీఫ్ ఎగ్జామినర్లు, 263మంది అసిస్టెంట్ ఎగ్జామినర్లు, ఆరుగురు విషయ నిపుణులు విధులు నిర్వర్తిస్తారని డీఐఈఓ రవిబాబు తెలిపారు. కాగా, సీసీ కెమెరాల నీడలో మూల్యాంకనం కొనసాగిస్తున్నామని వెల్లడించారు.

తలంబ్రాల బుకింగ్‌కు స్పందన

ఖమ్మంమయూరిసెంటర్: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయంలో జరగనున్న కల్యాణ తలంబ్రాలు ఇంటికే చేరవేసేందుకు ఆర్టీసీ కార్గో ద్వారా బుకింగ్ ప్రారంభించగా మంచి స్పందన వస్తోందని కార్గో మేనేజర్ వి.రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఇప్పటి వరకు 3వేల మంది భక్తులు రూ.151 చెల్లించి బుక్ చేసుకున్నారని వెల్లడించారు. ఆసక్తి ఉన్న భక్తులు కార్గో ఏజెంట్ల పాయింట్ల వద్ద సైతం బుక్ చేసుకోవచ్చని ఆయన తెలిపారు.

ప్రమాదంలో గాయపడినా పరీక్ష రాసిన విద్యార్థి


గాయపడిన అసన్

కొణిజర్ల: రోడ్డు ప్రమాదంలో గాయపడిన విద్యార్థి పదో తరగతి పరీక్ష కేంద్రానికి రాగా.. అక్కడకు అస్వస్థతకు గురవడంతో అధికారులు చికిత్స చే యించి పరీక్ష రాయించారు. వివరాలు... ఖమ్మం వైఎస్సార్ కాలనీకి చెందిన షేక్ జానీమియా కుమారుడు అసన్ రఘునాథపాలెం మండలం వి.వెంకటాయపాలెంలో పదో తరగతి చదువుతున్నాడు. ఆ పాఠశాల విద్యార్థులకు తనికెళ్లలోని సెయింట్ అలోషియస్ పాఠశాలలో పరీక్షా కేంద్రం ఏర్పాటుచేయగా శనివారం హిందీ పరీక్ష రాసేందుకు అసన్‌ను తండ్రితో బైక్‌పై తీసుకొస్తున్నాడు. మార్గమధ్యలో ఎదురుగా వచ్చిన ఆటో ఢీకొట్టగా ఇద్దరికి గాయాలయ్యాయి. దీంతో జానీఇచ్చిన సమాచారంతో ఆయ న భార్య చేరుకుని కుమారుడిని పరీక్షా కేంద్రానికి తీసుకొచ్చింది. అంతలోనే అసన్ వాంతి చేసుకుని కళ్లు తిరుగుతున్నాయని చెప్పగా, 108లో కొణిజర్ల పీహెచ్‌సీకి తరలించి అక్కడ చికిత్స అనంతరం కేంద్రానికి తీసుకొచ్చారు. ఈమేరకు అసన్ సజావుగా పరీక్ష రాయడంతో కుటుంబీకులు ఊపిరి పీల్చుకున్నారు.

రైతు మృతికి కారణమైన ఆటోడ్రైవర్‌పై కేసు

కామేపల్లి: ట్రాలీ ఆటో అజాగ్రత్తగా, అతివేగంగా నడిపి ఓ రైతు మృతికి కారకుడైన డ్రైవర్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని మద్రిగూడెం సమీపాన శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో హరిశ్చంద్రాపురం గ్రామానికి చెందిన జర్పుల రమేశ్ తీవ్రగాయాలై చికిత్స పొందుతూ మృతి చెందిన విషయం విదితమే. ఈమేరకు ఆయన భార్య లక్ష్మి ఫిర్యాదుతో శనివారం ఖమ్మంకు చెందిన ఆటో డ్రైవర్ షేక్ జావీద్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాయికుమార్ తెలిపారు.

నీటి గుంటలో జారిపడి బాలుడి మృతి


రాబిన్ మృతదేహం

వైరా: ప్రమాదవశాత్తు నీటి గుంటలో జారి పడిన బాలుడు మృతి చెందిన ఘటన వైరా మున్సిపాలిటీ పరిధి బీసీ కాలనీలో శనివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... బీసీ కాలనీకి చెందిన బెజ్జం బాలస్వామి – మేరీ దంపతుల కుమారుడు రాబిన్(9) స్నేహితులతో కలిసి వైరా రిజర్వాయర్ సమీపాన ఆడుకుంటున్నాడు. ఈక్రమంలో నీటి అంచునకు వెళ్లిన ఆయన ప్రమాదవశాత్తు అక్కడి గుంటలో జారి పడగా, ఈత రాకపోవడంతో నీట మునిగిపోయాడు. ఆయన స్నేహితులు ఇచ్చిన సమాచారంతో స్థానికులు, రాబిన్ తల్లిదండ్రులు చేరుకుని ఆయనను బయటకు తీసి ద్విచక్రవాహనంపై ఆస్పత్రికి తీసుకెళ్లేలోగా ఆయన బాలుడు మృతి చెందాడని వైద్యులు తెలిపారు. కాగా, బాలుడు బీసీ కాలనీ ప్రభుత్వ పాఠశాలలో నాలుగో తరగతి చదువుతుండగా, ఆయన సోదరి మణుగూరులోని గురుకులంలో పదో తరగతి చదువుతోంది. పాఠశాల నుంచి రాగానే ఆడుకోవడానికి వెళ్లిన రాబిన్ మృత్యువాత పడడంతో ఆయన తల్లిదండ్రులు, బంధువుల రోదనలు మిన్నంటాయి.

జ్వరంతో యువకుడు..

నేలకొండపల్లి: జ్వరం బారిన పడిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. మండలంలోని పైనంపల్లికి చెందిన గొర్రె సందీప్(24)కు ఇటీవల జ్వరం సోకగా ఆసత్రిలో చేర్పించారు. అక్కడే చికిత్స పొందుతూ శనివారం మృతి చెందగా, ఆయన మృతదేహం వద్ద కుటుంబీకులు రోదించిన తీరు అందరినీ కంటతడి పెట్టించింది.

బావిలో జారిపడి కూలీ..

చింతకాని: మండలంలోని నాగులవంచలో కూలీ కూరపాటి రాంబాయి (54) ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో జారి పడడంతో మృతి చెందింది. శనివారం ఉదయం పొలం పనికి వెళ్లిన ఆమె భోజన సమయాన తాగునీటి కోసం వ్యవసాయ బావి వద్దకు వెళ్లింది. ఈక్రమాన ప్రమాదవశాత్తు కాలు జారి బావిలో పడి మృతి చెందింది. రాంబాయికి భర్త, ఇద్దరు పిల్లలు ఉండగా, కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగుల్‌మీరా తెలిపారు.

రైలు నుంచి జారి పడిన వ్యక్తి..

మధిర: ప్రమాదవశాత్తు రైలు నుంచి జారిపడిన వ్యక్తి మృతి చెందాడు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఇంద్రజిత్(41) శనివారం రైలులో వెళ్తుండగా మధిర – తొండల గోపవరం స్టేషన్ల మధ్య డౌన్ లైన్‌పై జారిపడడంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈమేరకు మృతదేహాన్ని మధిర ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీ తరలించి కేసు నమోదు చేసినట్లు జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ ఎస్.వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు.

25ఏళ్ల పాటు విద్యుత్ కొనుగోలు చేస్తాం..

సోరప్లాంట్లపై అవగాహన సదస్సులో ఎన్పీడీసీఎల్ సీఎండీ

ఖమ్మంవ్యవసాయం: ఆసక్తి ఉన్న రైతులు పంట పొలాల్లో సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం పునరుత్పాదక శక్తి, నవీన శక్తి మంత్రిత్వ శాఖ ద్వారా పీఎం కుసుమ్ పథకాన్ని రూపొందించిందని ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి వెల్లడించారు. ఈ ప్లాంట్ల ద్వారా రైతులు ఉత్పత్తి చేసే విద్యుత్‌ను 25ఏళ్ల పాటు సంస్థలు కొనుగోలు చేస్తూ యూనిట్‌కు రూ.3.13 చెల్లిస్తాయని తెలిపారు. జిల్లాలో సౌరప్లాంట్లకు దరఖాస్తు చేసుకున్న 80 మంది రైతులకు ఖమ్మంలో శనివారం అవగాహన సదస్సు ఏర్పాటుచేశారు. ఈ సదస్సులో అదనపు కలెక్టర్ శ్రీజ, లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాసరెడ్డి, ఖమ్మం ఎస్ఈ ఇనుగుర్తి శ్రీనివాసాచారి, టీజీ రెడ్‌కో మేనేజర్ పి.అజయ్‌కుమార్ పాల్గొనగా.. హనుమకొండ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎండీ వరుణ్‌రెడ్డి మాట్లాడుతూ సౌరప్లాంట్ల ఏర్పాటుతో లాభాలను వివరించడమే కాక రైతుల సందేహాలను నివృత్తి చేశారు. 500 కిలోవాట్ల నుంచి 2మెగావాట్ల సామర్థ్యం కలిగిన ప్లాంట్లు ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. వ్యక్తిగతంగా లేక సమూహాలుగా ఏర్పాటుచేసుకునే అవకాశముండగా, సబ్ స్టేషన్లకు ఐదు కి.మీ. దూరాన ఉండాలని తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

మధిర: మధిర ముస్లిం కాలనీలో పేకాట ఆడుతున్న పలువురిని శనివారం టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఓ ఇంట్లో పేకాట ఆడుతున్నారనే సమాచారంతో పోలీసు సిబ్బంది కొండ, శివ, మల్లికార్జున్ తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా పలువురిని అదుపులోకి తీసుకుని రూ.4,140 నగదు స్వాధీనం చేసుకున్నారు.

ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన లారీ

సత్తుపల్లిటౌన్: పెట్రోల్ బంక్‌లో నుంచి బయటకు వస్తున్న లారీ.. ఆర్టీసీ బస్సును ఢీకొన్న ఘటన సత్తుపల్లిలోని శనివారం చోటుచేసుకుంది. సత్తుపల్లి నుంచి ఖమ్మంకు 60 మంది ప్రయాణికులతో వెళ్తున్న ఆర్టీసీ బస్సును కిష్టారం 'వై' జంక్షన్ వద్ద వద్ద బంక్‌లో నుంచి బయటకు వస్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ఘటనతో ప్రయాణికులు ఆందోళనకు గురికాగా ఎవరికీ గాయాలు కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. బస్సు ముందు భాగం దెబ్బతినడంతో మరో బస్సులో ప్రయాణికులను పంపించారు.

రోడ్డుప్రమాదంలో తీవ్రగాయాలు

సత్తుపల్లి: సత్తుపల్లిలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. తల్లాడకు చెందిన అద్దంకి రాము ద్విచక్ర వాహనంపై సత్తుపల్లి మండలం నారాయణపురంలోని అత్తగారింటికి బయలుదేరాడు. సత్తుపల్లి జ్యోతి నిలయం సమీపాన వెనుక నుంచి వచ్చిన కారు ఢీకొట్టడంతో రాము తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో స్థానికంగా ప్రాథమిక చికిత్స అనంతరం ఖమ్మం తరలించారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేయాలి


మొక్కజొన్నలను పరిశీలిస్తున్న నాయకులు

మధిర: రైతులు సాగుచేసిన మొక్కజొన్న చేతికి వస్తున్నందున మద్దతు ధర దక్కేలా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మధిర మండలం సిరిపురంలో కల్లాల్లో ఎండబోసిన మొక్కజొన్నలను శనివారం ఆయన పరిశీలించి రైతుల సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ కేంద్రాలు లేక అకాల వర్షాల భయంతో తక్కువ ధరకే వ్యాపారులకు అమ్ముకోవాల్సి వస్తుందన్నారు. ఈమేరకు మార్క్‌ఫెడ్ మేనేజర్ సునీతతో ఫోన్‌లో మాట్లాడి మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై దృష్టి సారించాలని కోరారు. బీజేపీ మధిర, పాలేరు అసెంబ్లీ కన్వీనర్లు ఏలూరి నాగేశ్వరరావు, సంతోష్‌రెడ్డి, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు అనంత్, నాయకులు ఉపేందర్ గౌడ్, పాపట్ల రమేష్, సూరోజు కనకాచారి తదితరులు పాల్గొన్నారు.

అమెరికాలో వెస్ట్ వర్జీనియా యూనివర్సిటీలో ఎండీ సీటు


నేహాశివానీని అభినందిస్తున్న నాగేంద్రకుమార్, నీలిమ

ఖమ్మం సహకారనగర్: అమెరికాలోని ప్రతిష్టాత్మక వెస్ట్ వర్జీనియా యూనివర్సిటీలో ఖమ్మంకు చెందిన డాక్టర్ రాజావాసిరెడ్డి నేహాశివాని ఎండీ(జనరల్ మెడిసిన్) సీటు సాధించింది. ఖమ్మంలోని రెజొనెన్స్ పాఠశాల, కళాశాలలో ఇంటర్ వరకు చదివిన ఆమె విజయవాడలోని సిద్ధార్థ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ పూర్తి చేసింది. ఆతర్వాత అమెరికాలో పీజీ సీటు కోసం దశల వారీగా జరిగిన పరీక్షలు, ఇంటర్వ్యూల్లో ప్రతిభ కనబర్చిన నేహాశివానీ వెస్ట్ వర్జీనియా యూనివర్సిటీలో సీటు సాధించిందని ఆమె తల్లిదండ్రులు, రెజొనెన్స్, సర్వజ్ఞ విద్యాసంస్థల డైరెక్టర్లు రాజావాసిరెడ్డి నాగేంద్ర కుమార్, నీలిమ వెల్లడించారు.

మధిర వాసికి...



మధిర: మధిరకు చెందిన డాక్టర్ మనోజ్ అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ సౌత్ కరోలినాలో ఎండీ న్యూరాలజీ విభాగంలో సీటు సాధించాడు. మధిర సేవా సమితి అధ్యక్షుడు పల్లపోతు ప్రసాదరావు సోదరుడైన శ్రీనివాసరావు కుమారుడు మనోజ్‌ను ఈ సందర్భంగా పలువురు అభినందించారు.

కొత్త రైల్వేలైన్‌కు భూసేకరణ


మోటమర్రి వద్ద సర్వేలో రైల్వే, రెవెన్యూ అధికారులు

బోనకల్: బోనకల్ మండలం మోటమర్రి నుండి జగ్గయ్యపేట వరకు నిర్మించే కొత్త రైల్వేలైన్ కోసం కేంద్రప్రభుత్వం ఇటీవల బడ్జెట్‌లో నిధులు కేటాయించింది. ఈమేరకు బోనకల్ మండలంలో ఆరు కిలోమీటర్ల లైన్ కోసం 53 ఎకరాల భూమి అవసరముండగా, మోటమర్రి వద్ద ఓవర్‌బ్రిడ్జి నిర్మాణానికి సైతం భూమి సేకరించాల్సి ఉంది. దీంతో రైల్వే సెక్షన్ ఇంజనీర్ రాజీవ్‌రంజన్, డీజీపీఎస్‌లు భారత్ షెకావత్, జితేందర్ గోస్వామి శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వీరి వెంట తహసీల్దార్ పున్నంచందర్, సర్వేయర్ కృష్ణమూర్తి, ఆర్ఐ నవీన్ ఉన్నారు. కాగా, భూసేకరణ అనంతరం నిర్మించే ప్రత్యేక లైన్ కేవలం గూడ్స్ రైళ్ల కోసమేనని వెల్లడించారు.

పామాయిల్ ఫ్యాక్టరీ శంకుస్థాపనకు ఏర్పాట్లు

వేంసూరు: వేంసూరు మండలం కల్లూరుగూడెంలో పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మాణ పనులకు త్వరలోనే శంకుస్థాపన జరగనుంది. గ్రామంలోని 42 ఎకరాల్లో ఫ్యాక్టరీ నిర్మించనుండగా ఇప్పటికే స్థలం చుట్టూ ఫెన్సింగ్ వేశారు. అంతేకాక కల్లూరుగూడెం ప్రధాన రహదారి నుంచి అక్కడకు వెళ్లేలా రహదారి నిర్మాణ పనులు చేపడుతున్నారు. ఉగాది పండుగ సందర్భంగా ఫ్యాక్టరీకి శంకుస్థాపన చేయనుండగా... సామూహిక పట్టా భూమిలో నిర్మాణం చేపట్టవద్దని కొందరు కోర్టును ఆశ్రయించడం గమనార్హం.

ఖాళీ బిందెలతో నిరసన


నిరసనలో పాల్గొన్న కాలనీవాసులు

మధిర: తాగునీరు సరఫరా చేయాలని కోరుతూ మండలంలోని ఆత్కూరు సమీపాన కుంటబీడు కాలనీవాసులు శనివారం ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. వీరికి సీపీఎం మండల కార్యదర్శి మందా సైదులు సంఘీభావం తెలిపి మాట్లాడుతూ కుంటబీడు కాలనీలో మిషన్ భగీరథ పైప్‌లైన్లు లేనందున గ్రామపంచాయతీ ద్వారా తాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంకె శివయ్య, పల్లె బాబు, జానకమ్మ, నాగయ్య, వెంకటరత్నం, మీనుగు పద్మ, వెంకటకుమారి, మేరి, ఏసుమణి, ఖమ్మంపాటి కమలమ్మ, సాయమ్మ, రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.